మనం నిలబడి చూస్తున్న కేంద్ర బిందువును బట్టే తూర్పు పడమరలన్నవి ఏర్పడతాయి. మనసు, మమత, అభిమానం, అనురాగం ఎక్కడ లభ్యమైతే అక్కడే జీవనసాఫల్యం - అది తూర్పయినా, పడమరయినా!

# తూర్పు - పడమర

తూర్పూ - పడమరా అంటూ ఉంటారు. రెండు విభిన్న దృక్పథాల్నో, మనస్తత్వాల్నో, ఒకదానికొకటి సరిపడని వాటినో అలా పోలుస్తారు. అంటే వాటిలో ఉత్తర ధృవానికీ, దక్షిణ ధృవాలకీ ఉన్నంత విభేదం ఉందన్నమాట. ఒకటి వెలుతురు. మరొకటి చీకటి. సూర్యుడదయించే దిశ - అంటే తూర్పున ఉన్నవన్నీ తూర్పు దేశాలు. అస్తమించే పడమటి దిశ నున్నవన్నీ పశ్చిమ దేశాలు. వాటికీ, వీటికీ తూర్పుకీ, పడమరకీ ఉన్నంత తేడా ఉంది మరి. వీరి సంప్రదాయం, సంస్కృతీ వేరు. వారివి వేరు. తూర్పు దేశాల వారికి వేలకొద్దీ సంవత్సరాల చరిత్ర ఉంది. ఒకప్పుడు వారు, సంపన్నంగా ఉండేవారు. అంటే వారి తాతలనాడు నేతులు తాగారన్నమాట. ఇప్పటి సంగతి అడగొద్దు. ప్రస్తుతం పశ్చిమ దేశాలవారు బాగా నాగరికులుగా చెలామణీ అయిపోతున్నారు. వారి దేశాలిపప్పుడెంతో పురోభివృద్ధిని సాధించాయి. తూర్పు దేశాల నుంచి తెలివైన బుర్రలన్నీ ఎగుమతి, అయిపోయి పశ్చిమ దేశాల స్థాయి పెరగడానికి దోహదం చేస్తూన్నాయని తూర్పు వారంతా లబోదిబో మంటున్నారు. పశ్చిమ దేశాల వాళ్లు, వాళ్ల తెలివి తేటల్తో, జేబులో బాంబులు దాచుకుని, తూర్పు వాళ్ల చేయి మెలిపెట్టేస్తున్నారనీ, చెవి నులిమేస్తున్నారనీ కూడా ఈ తూర్పు వాళ్లు వాపోతున్నారు. వాళ్లు వెయ్యో, ఫ్ఫదివేలో టన్నుల బాంబులు పేల్చేసి 'చూశావా ఎంత ప్రమాదమో! అందుకే చెయి కాల్చుకోవద్దంటున్నాము' అని పెద్దన్నయ్యల్లా తూర్పు వాళ్లకి బుద్ధి చేప్పేస్తున్నారు. తూర్పు వాళ్లకి 'ఆకలెక్కువ పీక సన్నం!' పశ్చిమ దేశవాసుల కులం మతం వేరు. నీతి నియమాలకి వాళ్లు నిర్ణయించుకున్న హద్దులే వేరు. మరి తూర్పు వాళ్లకవి సరిపడవు. వాళ్లవి వాళ్లకున్నాయి. ఇలా ఆలోచిస్తూ పోతే, అబ్బో! తూర్పు - పడమర కింత కథ ఉందా!' అనిపిస్తుంది.

నేనూ అలాగే అనుకునేవాడిని, ఈ మధ్యకాలం వరకూ! అంటే నేను రాజుని కలుసుకోనంత వరకూ. రాజుని కలుసుకున్నాక నా ఆలోచనల విషయంలో నేను కష్టాల్లో పడ్డాను. ముందు మనం చదువుకున్న దానికి పూర్తిగా వ్యతిరేకం రాజు. ఈ తూర్పూ -

పడమరా అంతా హంబగ్ అంటాడు రాజు. అసలలాంటివేమీ లేవంటాడు. ఒకదాని కొకటి సాపేక్షమే తప్ప, ఇటొకటీ, అటొకటీ లేవని అతని సిద్ధాంతం. ఇది 'పిచ్చి ఊహ'లా అనిపించినా, గొప్పవాళ్ల ఊహలు పిచ్చిగానే ఉంటాయి గాబట్టి నమ్మబుద్ధేస్తుంది. కొంచెం శ్రమించి మెదడుకి మేత వేస్తే మనం కూడా పిచ్చివాళ్లంత బాగా ఆలోచించగలుగుతాం! ఉదాహరణకి రాజు ఆర్గ్యుమెంట్సునే తీసుకుందాం. అందులో నిజం లేకపోలేదనిపిస్తుంది.

"ఏమిటండీ? ఈ తూర్పూ - పడమరా? ఎక్కడున్నాయండీ ఇవి? మనకి పడమరగా ఉన్న ఆఫ్రికా మరి అమెరికాకి తూర్పున ఉంది కదా! అది తూర్పా? పడమరా? మనదేశంలోనే తీసుకోండి. అరేబియా సముద్రం వైపు ఉండే ముంబయి లాంటి నగరాలు మనకి పడమర కాని, బంగాళాఖాతం వైపున్న చెన్నై లాంటి నగరాలు తూర్పు అవుతాయి. అంటే తూర్పులోనే పడమర, పడమరలోనే తూర్పు ఇమిడిపోయి ఉన్నాయనేగా అర్థం. అంతెందుకు మన రాష్ట్రంలోనే 'తూర్పు వాళ్లం'టాం! తూర్పు ఆవకాయ ఎండబెట్టి పెడతారు. మహా చెడ్డ రుచి లెండి. ఇంకా దగ్గర కొస్తే చూడండి! మీరు నాకు తూర్పుగా కూచున్నారు. అంటే నేను మీకు పడమటి వాడిననేగా! నేనే తూర్పు కెదురుగా నిలబడితే నా ముఖం తూర్పయితే, వీపు పడమరౌతుంది. అందుకే ఈ తూర్పు పడమర వాదులాట అనవసరం అంటాన్నేను."

ఇలా సాగుతుందిన రాజు వాదన. ఆ వాదన విన్నప్పుడల్లా రాజుతో ఏకీభవించి 'నా ఓటు నీకే' అనాలనిపిస్తుంది.

సూర్యుడుదయించే తూర్పు దిక్కుగా ఉన్న జపాను వాళ్లు మాది 'ల్యాండ్ ఆఫ్ రైజింగ్ సన్నోచ్చి!' అని చెప్పుకుని చంకలు గుద్దుకుంటారు. మరి అమెరికా వాళ్లది పడమర కాబట్టి 'ల్యాండ్ ఆఫ్ సెట్టింగ్ సన్' కావాలికదా! అలాగని వాళ్లేం గొప్పలు చెప్పుకోరు. ఎందుకో! వాళ్లకెప్పుడూ, 'మీరు స్నేక్ ఛార్మర్సు! మీరు దారిద్ర్యరేఖకి దిగువగా బతుకుతున్నారా?' అని తూర్పు వాళ్ల నుడికించడం సరదా! బ్రిటిషు వాళ్ల సంగతి సరేసరి. ఒకప్పుడు మాది సూర్యుడస్తమించని సామ్రాజ్యం అని గర్వపడిపోతూంటారు. అంటే వాళ్లకి తూర్పూ - పడమరా తేడా తెలీదన్న మాట. ఇలాంటి విషయాలన్నీ రాజు చెప్తూంటే 'అమ్మో! వీడి పొట్టలో ఎన్ని రహస్యాలు దాగున్నాయో!' అని ఉడుక్కుంటూండేవాడిని నేను.

రాజు పుట్టింది పాడ్యమి నాడు, పల్లెటూరు 'గునుపూడి'లోనే అయినా, శుక్ల పక్ష చంద్రుడిలా రోజు రోజుకీ కళల్లో పెరిగిపోయి, కొన్ని వసంతాలయ్యాక ఓ పౌర్ణమినాడు న్యూయార్కులో తేలాడు. ముందు పై చదువుల కోసం వెళ్లి, ఉద్యోగంలోకి మారి, దరిమిలా వ్యాపారంలో స్థిరపడ్డాడు. గ్లోబంతా చుట్ట బెట్టేశాడు. అంత అనుభవం ఉన్నవాడు అబద్ధం చెప్పడనే ధైర్యంతోటే వాడు చెప్పేవన్నీ నమ్మతూ వచ్చాను నేను.

రాజుతో నా పరిచయం పూర్తిగా పెరగకముందు పశ్చిమ దేశాల వాళ్లంటే నాకు అదోలాంటి భావన ఉండేది. అది చాలావరకు చెప్పుడు మాటలు, సినిమాల ప్రభావం. బీ.బీ.సీ, వాళ్లు మన కుళ్లు ప్రాంతాలన్నీ జాగ్రత్తగా వీడియో తీసేసి 'ఇదండీ తూర్పు' అని వాళ్ల వాళ్లకి చూపించినట్టు పడమర నుంచి వచ్చే సినిమాలూ, మనుషులూ, వగైరా వాళ్ల

గురించి మనకు తెలియజెప్పుతా(యి)రు కదా! అలాంటివి కళ్లారా చూసీ, చెవులారా వినీ, పడమర అంటే అసహ్యం పెంచుకున్నాన్నేను. అక్కడి ఆడాళ్లు ఒళ్లు దాచుకోకుండా తక్కువే బట్టలేసుకుంటారనీ, చెమట పట్టదు కనక స్నానం చేసే ప్రసక్తే లేదనీ, మొహాలు కడగరు కనక నోరు కంపు కొట్టకుండా చాక్లేట్లు నమిలేస్తారనీ, ఒకళ్లంటే ఒకళ్లకి పరస్పరం అనురాగాలూ, అభిమానాలూ ఉండవనీ, ఆడాళ్లు రోజుకో మొగుణ్ని మార్చేస్తారనీ, పిల్లలకి తల్లిదండ్రులంటే లెక్కలేదనీ, దేశాధ్యక్షుడి దగ్గర్నుంచి, ఒట్టి దెష్టగాడి వరకూ సెక్సంటే చులకన భావం అనీ, అందరూ అదేపనిగా పశుమాంసం తినేస్తుంటారనీ....ఇత్యాది.

రాజుతో, ప్రసంగవశాత్తు, ఈ విషయాలే ప్రస్తావిస్తే ఉగ్రుడైపోయి, వాటిని పేరు పేరునా, తండ్రి పాపారాయుడి కత్తి లాంటి వాదనతో ఖండించి పారేసేశాడు. అప్పటి రాజు ఆవేశం చూస్తుంటే "పులి! పులి! పడమటి పులి!"అని అరుస్తున్నాడనిపించేది నాకు.

అదంతా వట్టి అబద్ధమనీ, వాళ్లకీ బంధు ప్రీతీ, మర్యాదా ఉన్నాయనీ, అక్కడి వాతావరణానికీ, సమాజానికీ తగ్గట్టుగా వాటికి అవధులున్నాయనీ వాదించేశాడు. ఆడాళ్లు అలా మనుషుల్ని రెచ్చగొట్టేలా బట్టలేసుకుంటారంటే, అది వాళ్ల ఆచారమనీ, అక్కడి వాళ్లెవరూ దాన్ని తప్పుపట్టరనీ, చెప్పేశాడు. సెక్సు విషయంలో మన అలవాట్లు మనవి. వాళ్ల అలవాట్లు వాళ్లవి. అది పవిత్రమైన సృష్టి కార్యమని మనం అనుకుంటే, అది కేవలం ఒక భౌతికమైన అవసరం మాత్రమే అని వారి దృక్పథం. అందువల్ల తప్పు లేదు. మన కుటుంబ వ్యవస్థలో ఒకళ్ల మీద ఒకళ్లం ఆధారపడి బతుకుతాం. వారి పిల్లలు, వయసు రాగానే స్వతంత్రులౌతారు. అంటే ఇక తల్లిదండ్రుల మీద ఆధారపడరు. అందుకే ముసలి తనంలో ఆదుకోవలసిన బాధ్యత ఉండదు వారికి. మరి ముసలాళ్ల గతి అధోగతేనా అంటే, దానికీ ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి వాళ్ల దేశాల్లో. ఓ విధంగా ఆలోచిస్తే ఆ విధానమే మంచిదనిపిస్తుంది. మనం మతం పేరుతో మద్య మాంసాలు అసలు పుచ్చుకోకపోవడమో, కొండొకచో కొద్దిగా మాత్రమే పుచ్చుకోవడమో చేస్తాము. వారి మతం ప్రకారం వారికి మత్తు పానీయాలూ, మాంసభక్షణం తప్పులేదేమో! మనిషి తను బ్రతకడం కోసం ఇతర ప్రాణుల్ని హింసించవచ్చని వాళ్ల అభిమతమేమో! నేనిలా అన్నానంటే విడ్డూరంగా ఉంటుందేమోకాని, మీరే ఆలోచించండి. ప్రపంచంలో మనుషులందరూ మాంసాహారం మనేసి ఆకులలములు భక్షించడం మొదలు పెడితే, ఈ భూమి మీద ఉన్న వృక్షజాలం అంతా అనతి కాలంలోనే 'హూష్ కాకీ!' అయిపోతుంది. జంతుజాలం అంతా తినేవాళ్లు లేక ఎక్కడ పడితే అక్కడ నేల ఈనినట్లు పుంఖాను పుంఖాలుగా పెరిగిపోతుంది. అప్పుడిక అవే మనని తినేసే పరిస్థితి ఏర్పడుతుంది. 'నత్తలొస్తున్నాయి జాగ్రత్త','గోవులొస్తున్నాయి జాగ్రత్త' అని మనమంతా గుహల్లో దాక్కునే రోజులొస్తాయి. అందుకే ప్రకృతితో సమన్వయం కావాలంటాను. ఈ విషయాల్లో ఒకళ్ల నొకళ్లు తప్పుపట్టి ప్రయోజనం లేదు! - ఇలా సాగుతుంది రాజు వాదించే ధోరణి.

అలాగని రాజు అభిప్రాయాలు కేవలం లెక్చర్లు దంచడం వరకే పరిమితం అని మీరనుకుంటే పప్పులో కాలేసినట్టే! అతను జీవితంలో ఎన్నో ప్రయోగాలు చేశాడు. కనీసం

తన చేతల్ని అలా నమ్మాడు రాజు. భారత్‌లో ఉన్నంతకాలం భారతీయుడిగానే ఉన్నా, అమెరికాలో అమెరికన్లలాగా, ఇంగ్లాండులో ఇంగ్లీషు వాళ్లలాగా ఉండడం నేర్చుకున్నాడు. అందులో సఫలీకృతుడయ్యాడు కూడా.

క్రొత్తగా పై చదువుల కోసం న్యూయార్కు వెళ్లిన రోజుల్లో అతనికి అమెరికా స్వర్గంలా కనిపించింది. ఇంద్రుడు తారసపడలేదు గానీ, ఒకరిద్దరు అప్సరసలు ఢీకొట్టారు. సురాపానం సరే ఉండనే ఉంది. మరి స్వర్గం ఎక్కడో ఉంటుందేంటి?

తారసపడిన దేవతా స్త్రీలలో ఓ పడుచు "నరుడా! నరుడా! ఓ భారతపుత్రా! నువ్వంటేనే నా కిష్టం" అని వెంట బడింది. మొదట్లో 'ఇదేం గోలరా బాబూ!' అని తప్పించుకో జూసినా, రాజుకి కొద్ది నెలల పరిచయంలో ఆ పిల్ల బాగా దగ్గరయింది. గులాబీ లాంటి అందం. పదహారేళ్ల వయసులోనే అమృతం తాగేసి, ఇక ఎదగని ఆమె వయసు, సొగసు, పసిమి, మిసిమి రాజుని ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. త్వరలోనే పరిచయం స్నేహంగా మారి ఆమె అతనికి బాగా సన్నిహితం అయింది. కోరివచ్చి చేసిన స్నేహమాయె! ఆమెకు దగ్గరయిన కొద్దీ, ఆమెది పవిత్రమైన మనసుతో కోరిన స్నేహబంధం అని రాజుకి అర్థం అయింది.

రాజు చదువుతున్న కాలేజీలోనే చదువుకుంటున్న ఆమె పేరు ఏంజలీనా! ఏంజలీనా ఒంటరిగా ఉంటూ, చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తూ, కొంత డబ్బు దాచుకుని ఒకటీ ఒకటీ సెమిస్టర్లు పూర్తి చేస్తోంది. అంత తెలివైంది కాక పోవడంతో స్కాలర్‌షిప్పులు రావు. రాజు మంచి మార్కులతో పాసవడంతో, ఉద్యోగాన్వేషణ లేకుండా, స్కాలర్ షిప్పులతో చదువు గట్టెక్కిపోతుంది. అతని తెలివి తేటలు, మంచి నడతా కారణంగానే ఏంజలీనా అతని వైపు ఆకర్షితురాలైంది. ఒక్కొక్కప్పుడు సెలవుల్లో రాజుతో కాలక్షేపం చేస్తూ రాత్రిళ్లు అతని రూములోనే ఉండిపోయేది. ఒకే మంచం మీద పడుకున్నా కామవికారాలేం కనిపించనిచ్చేది కాదు. రాజుని కూడా తన రూముకి తీసికెళ్తూ ఉండేది. వయసులో తనకంటె చిన్నదైన ఆమె చూపే నిగ్రహానికి అద్భుతంగా ఫీలయ్యేవాడు రాజు. అతనితో కబుర్లు చెప్తుంటే యుగాలు నిముషాలుగా దొర్లిపోతాయని సంతోషించేది. రాజు స్వదేశం, కుటుంబ విషయాలూ, సంస్కృతి గురించి అడిగి తెలుసుకనేది. తన కుటుంబం తాలూకు విషాదగాథ వివరించి చెప్తుండేది.

ఈ రోజు ఏంజలీనా లేమిలో ఉన్నా, ఒకప్పుడు వాళ్లు బాగా బతికిన వాళ్లే. ఎంజలీనా తండ్రి ఇటలీ దేశస్తుడు. కార్పెంటరీ చేసేవాడు. జీవనభృతికని యుగాండా వలస వెళ్లింది వాళ్ల కుటుంబం. కడుపు చేత్తో పట్టుకుని అక్కడ చేరిన ఆమె తండ్రి దశ తిరిగి బాగా సంపాదించాడు. ఆ తండ్రికి వాళ్లు అయిదుగురు పిల్లలు. ముగ్గురు మొగ, ఇద్దరు ఆడ. తను కడసారపుది. తను పుట్టేనాటికి తండ్రి అయిదు వందల ఎకరాల భూస్వామి. అక్కడ పండని పళ్లు లేవు. వేయని సేద్యాలు లేవు. పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని అయిదు పెద్ద భవంతుల్ని నిర్మించాడు. తనెప్పుడూ గుర్రాల మీదనే తిరిగేది. సర్వెంట్ల చేతుల మీద కాళ్లేసి గుర్రం దిగేది. అటువంటి, వారి ఔన్నత్యం చూసి భగవంతుడికే కన్ను కుట్టినట్టుంది. అప్పట్లో యుగాండాలో పరదేశీయుల్ని పారద్రోలే ఉద్యమం తలెత్తింది. వివిధ దేశాల నుంచి వచ్చి స్థిరపడిన వారందరూ ఎక్కడి వారు అక్కడ చెల్లా చెదురైపోయారు.

ఎదిరించిన వారు సమూలంగా నాశనం అయిపోయారు. ఏంజలీనా తండ్రి స్వదేశానికి తిరిగి వెళ్లడం ఇష్టంలేక, పూలమ్మిన చోటనే కట్టెలమ్ముకోవడం భరించలేక, తన కళ్లెదురుగానే, సంపాదించిందంతా అపహరించబడుతూంటే చూసి సహించలేక అవమాన భారంతో, ఆత్మహత్య చేసుకున్నాడు. గత్యంతరం లేక ప్రాణాలరచేత పట్టుకుని, తల్లీ, అయిదుగురు పిల్లలూ, కట్టుబట్టల్తో ఇటలీ చేరుకున్నారు. ఇటువంటి దయనీయ పరిస్థితుల్లో తల్లి ఇంత కుటుంబ భారాన్ని ఎలాగూ మోయలేదు కనుక ఎవరి దారి వారు చూసుకున్నారు. తను ధైర్యం చేసి ఇలా వచ్చేసింది - కూలిపనైనా చేసి పొట్ట నింపుకుంటూ, చదువుకుని ఏదైనా ఉద్యోగంలో స్థిరపడాలనే ఉద్దేశంతో.

ఏంజలీనా చెప్పిన కరుణామయమైన కథ విని ఆమెపై జాలి, గౌరవమూ ఎక్కువయ్యాయి రాజుకి. ఆమెను మనసారా ఆదరించి, అభిమానించే వాడు. బతికి చెడిన పిల్ల కావడంతో తన హద్దుల్లో ఉండేది. అలా తన జీవితంలో ప్రవేశించిన ఏంజలీనా సంవత్సరం పాటు రాజుని అలరించి, మరో ఉద్యోగంలోకి మారి దూరంగా వెళ్లిపోయి, తన జీవితం నుంచి కూడా దూరమయింది.

చదువు పూర్తయి యు.ఎన్.లో కంప్యూటరు ఇంజనీరుగా జాయినయ్యాడు రాజు. అక్కడ పరిచయం అయింది తన కొలీగ్ బెట్టీతో. బెట్టీ ధనవంతుల బిడ్డ. తండ్రి పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఉబుసుపోకకని తను ఉద్యోగం చేస్తోంది. ఆఫీసులో ఛాటర్ బాక్సులా వాగుతూంటుంది. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉండే మనస్తత్వం. చుట్టూ ఉన్న వాళ్లందరిలో రాజు ఆమెను ఎక్కువగా ఆకర్షించాడు. అతనితో పరిచయం బాగా పెరిగి రానురాను రాత్రింబగళ్లు అతనితోనే గడపడానికి ఇష్టపడేది బెట్టీ. "ఇలా తెల్లవార్లూ నాతో ఉండి పోతే నీ పేరెంట్సు ఏమీ అనరా?" అని రాజు అడిగితే, "ఏమంటారు? ఎందు కంటారు? నా జీవితం! నా యిష్టం!" అని దబాయించేది. సరదాగా బీచ్‌కి వెళ్లినప్పుడూ, రాత్రి పూట రూములో వైను పార్టీలోనూ తన గురించి చెప్తూ ఉండేద.

బెట్టీ వాళ్ల పూర్వీకులు బ్రిటిషువాళ్లు. 'వేల్సు' లో ఇప్పటికీ వాళ్లకి ఆస్తి ఉంది. మొదట్నుంచీ వ్యాపారస్తుల కుటుంబం. వ్యాపారాన్ని ఇంకా అభివృద్ధి చేయడం కోసం తన తండ్రి అమెరికా వచ్చేశాడు.

ఓసారి సెలవుల్లో బెట్టీ రాజుని వేల్సుకి తీసికెళ్లింది. అక్కడో చిన్న ఊళ్లో వాళ్ల ఎస్టేటు చూపించింది. ఆ వూళ్లో ఓ పాత కాలపు చర్చి ఉంది అందులోనే 'పాతాళగంగ' అనిపించే ఓ లోతు నుయ్యి ఉంది. ఆ చర్చిలో క్రీస్తుని పూజిస్తే కోరిన కోరిక తీరుస్తాడనీ, ఆ నూతిలో నీరు తాగితే ఎటువంటి జబ్బయినా నయమౌతుందనీ చెప్పింది బెట్టీ. కాశీవిశ్వేశ్వరుడి గుడీ, గంగానదీ జ్ఞాపకం వచ్చాయి రాజుకి. 'మూఢనమ్మకాల్లో వీళ్లు మనకేం తీసిపోరు' అనుకున్నాడు మనసులోనే.

"నువ్వెప్పుడైనా ఇక్కడ పూజ చేసి ఈ నీళ్లు తాగావా?"

"నాకేం జబ్బు ఉందని?"

"ఇలా జులాయిగా తిరగడం...."

"ఓహ్! అదా! హాయిగా జీవితాన్ని అనుభవించడం తెలుసుకోవాలి"

"మరి మంచి మొగుడు కావాలని మొక్క లేదా?"

"పెళ్లి అంటే నాకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. భర్తలో కావాలనుకున్న గుణాలున్న మొగాడు ఎదురైతే తప్ప జీవితంలో పెళ్లి చేసుకోను. పెళ్లి వేరు. సెక్సు వేరు."

"అప్పటి వరకూ ఇంతేనా?"

"ఇప్పుడు నాకేంలోటు? నీ వంటి చక్కని యువకులు చేరదీసినంతకాలం. సంసార లపటంలో అనేకమైన చిక్కులు"

ఇలా జరిగేది వారి సంభాషణ.

న్యూయార్కులో రాజు ఉన్నంత కాలం బుద్ధి పుట్టినప్పుడల్లా బెట్టీ గాలి విసురులా అతని రూము కొచ్చేస్తూండేది. వచ్చిందంటే, అతన్ని నానా అల్లరీ పెట్టి, చిలిపి పనుల్లో కవ్వించేది. ఆమె సన్నిధిలో రాజు చిన్నపిల్లవాడై పోయేవాడు. అతనితో సెక్సు ఆమెకు విపరీతమైన సంతృప్తి నిచ్చేది. కండోమ్స్ ఎప్పుడూ ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోనే ఉంటాయి కాబట్టి ఆ బెంగ లేదు. రెండేళ్లు అలా గడిచాయి.

రాజుకి యు.ఎస్.లో ఉద్యోగం అంతగా నచ్చడంలేదు. అమెరికాలో ఒకేరకం ఉద్యోగం కానీ, వ్యాపారం కానీ ఎక్కువకాలం సాగించడం పురోభివృద్ధికి తార్కాణం కాదు. ఉద్యోగానికి రాజీనామా చేసి కాలిఫోర్నియాలో స్వంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ స్టార్టు చేశాడు రాజు. తూర్పు నుంచి పడమరకి మకాం మార్చవలసి వచ్చింది.

"ఈ రెండేళ్లు నా జీవితంలో మరిచిపోలేనివి. ఎప్పుడేనా నన్ను జ్ఞాపకం చేసుకుంటూ ఉండు" అని వీడ్కోలు చెప్పింది బెట్టీ.

కాలిఫోర్నియాలో కొత్త పరిసరాల్లో చక్కగా ఇమిడి పోయాడు రాజు. ఓనాడు బిజినెస్ చూసుకుని అర్ధరాత్రి టైములో ఇంటికి వస్తూండగా, కారు చెడిపోయి లిఫ్టు కోసం వెయిట్ చేస్తున్న ఫ్లొరెన్సుకి లిఫ్టు ఇవ్వడంతో వారి పరిచయం ప్రారంభం అయింది. ఆమె తనుంటున్న ఇంటికి రెండిళ్ల అవతలే ఉంటోందని తెలుసుకున్నాడు రాజు. ఫ్లొరెన్సుకి సుమారు తన వయసే ఉంటుంది. చాలా నాజూకుగా ఉంటుంది. నెమ్మదిగా పారే సెలయేరులా మాట్లాడుతుంది. మాటల సందర్భంలో ఆమె 'విడో' అని తెలిసి ఆశ్చర్యపోయాడు రాజు. పెళ్లయిన రెండేళ్లలోనే భర్త కారు ప్రమాదంలో మరణించాడని చెప్పింది. తను ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నానంది. పునర్వివాహం గురించి ప్రస్తావిస్తే ముభావంగా ఊరుకుని ముఖం అటు తిప్పేసుకుంది. ఆమె ప్రస్తుతం ఉన్న పరిస్థితులవల్లనో ఏమో, ఫ్లొరెన్సు అంటే అమితమైన గౌరవభావం ఏర్పడింది రాజు మనసులో. కావాలనే ఆమెతో స్నేహం పెంచుకున్నాడు. పరిచయాలు పెరగడంతో రాకపోకలూ పెరిగాయి. తనూ మనసు విప్పి మాట్లాడసాగింది రాజుతో.

ఇద్దరూ రాత్రి సమయంలో ఒక దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. వాటిలో ప్రపంచ రాజకీయాల నుంచి దేశదేశాల సంస్కృతి, సంప్రదాయాల వరకూ, సినిమాల

నుంచి సెక్సు వరకూ, ఎన్నో విషయాలు దొర్లుతూండేవి. ఒకరికొకరు సన్నిహితులైనకొద్దీ, ఫ్లొరెన్సుని, బెట్టీతో పోల్చి చూసుకునేవాడు రాజు. ఇద్దరిలోనూ ఎంత విభేదం!! ఒకరు గలగలపారే వరద గోదారి అయితే, మరొకరు గంభీర, ప్రశాంత మహాసాగరం. రాజు బెట్టీని ఆకర్షించాడు. ఫ్లొరెన్సు రాజుని ఆకర్షించింది.

"నా జీవితంలో చెప్పుకోగల మైలు రాళ్లు లేవు. నీ గురించి చెప్పు" అని అర్థించేది ఫ్లొరెన్సు.

అప్పుడు రాజు తను భారతదేశంలో ఓ చిన్న గ్రామం అయిన గునుపూడిలో పుట్టాననీ, ఆ వూర్లో రోడ్లు ఉండవనీ బాగా వెనుకబడిన ప్రాంతం అనీ, ఇలా స్త్రీ పురుషులు విచ్చల విడిగా కలిసి తిరగడం అక్కడ ఊహకి కూడా అందని విషయమనీ చెప్పుతూంటే తను నమ్మేది కాదు.

"నువ్వు నన్ను చిన్న పిల్లను చేసి ఆడిస్తున్నావు. రోడ్లు లేని ఊరు ఉంటుందా? మరి బస్సులు, కార్లు ఎలా నడుస్తాయి? అసలు ప్రజలెలా బ్రతుకుతారు అలాంటి ప్రదేశాల్లో? ఒకరినొకరు తెలుసుకోకుండా స్త్రీ పురుషులెలా పెళ్లి చేసుకుంటారు? అది సుఖాంతం కాగలదా? ఇవన్నీ నమ్మదగినవేనా?" అని అడిగేది.

"నేను చెప్పేవి నమ్మాలంటే నాతోబాటు ఇండియా రావాలి నువ్వు" అన్నాడోనాడు రాజు.

"ఈసారి నువ్వెళ్లినప్పుడు నీతో తీసికెళ్లు. నేను రెడీ! అటువంటి అపురూపమైన దేశం చూడాలని ఉంది" అంది.

అలా వారి పరిచయాలు పెరిగి ఇద్దరూ బాగా దగ్గిరయ్యారు. కోరికలు గుర్రాలయ్యాయి. ఫ్లొరెన్సు కండోమ్సు కూడా వాడేది గాదు. ఈ పరిచయం వివాహం వరకు దారి తీస్తుందేమోనని రాజు మథన పడుతున్న సమయంలో, ఫ్లొరెన్సు తానై చెప్పనే చెప్పంది. రాజు ద్వారా తనొక బాబుని కనాలని కోరికగా ఉందనీ. ఆ కోరిక తీరగానే తను ఆతని జీవితం నుండి సాదరంగా తప్పుకుంటాననీ. పిల్లలూ, పెంపకం గురించి బెంగపెట్టుకోవద్దనీ, అదంతా తన బాధ్యత అనీ, ఉత్తరోత్తరాతను ఎవరినైనా వివాహం చేసుకున్నా అదొక పెద్ద సమస్య కాదనీ, ఈ సమాజంలో ఇవి చాలా సహజమైనవనీ అతనికి నచ్చజెప్పింది.

ఆ సంవత్సరం క్రిస్మస్ టైములో ఫ్లొరెన్సూ రాజూ గునుపూడి వెళ్లారు. అక్కడి పరిస్థితులు కళ్లారా చూశాక, రాజు చెప్పిన దాంట్లో అతిశయోక్తి ఏమీలేదని తెలుసుకుంది ఫ్లొరెన్సు. అక్కడామె ప్రత్యేకంగా గమనించినవి, ప్రజల అమాయకత్వం, అల్పజ్ఞత. కాని అంతలోనే వారు ప్రకృతి కెంతదగ్గర్లో ఉంటున్నారోననే ఆనందం. నూతిలో నీరు తోడుకుని స్నానం, చెట్టుకాయ కోసుకుని తినడం, ఎక్కడా వాతావరణ కాలుష్యం లేకపోవడం, అన్నీ ఆమెనెంతో ఆకర్షించాయి. మళ్లీ, వారి ఆర్థిక పరిస్థితుల్ని ఎన్ని యు.ఎన్.లు మెరుగు పరచగలరని విచారం. ఇలా ఊగిసలాడేది ఆమె మనసు.

ఓనాడు రాజు ఫ్లొరెన్సుని వాళ్ల మామిడి తోటలోకి తీసికెళ్లాడు. చక్కగా కొత్త చిగుళ్లు వేసి, కొన్ని చెట్లు నిండుగా పూసి, కసుగాయలు, పిందెలతో కలకల్లాడుతూ రాబోయే వసంతానికి వెల్‌కమ్ చెప్పుతున్నట్టుంది ఆ తోట. దాన్ని అందాన్ని చూసి ముగ్ధురాలై ఆ రోజంతా అక్కడే ఉండిపోదామని పట్టుపట్టింది ఫ్లొరెన్సు. ఆ రాత్రికి వారు ఓ బంగినపల్లి మామిడి చెట్టు క్రింద శుభ్రం చేసుకుని, దుప్పటీ పరుచుకుని అలాగే పడుకున్నారు. ఫ్లొరెన్సుకి అదొక అనిర్వచనీయమైన అనుభూతి. జన్మతరించిందనే సంతృప్తి.

రాజు దొరసానమ్మని తీసుకొచ్చాడని మొదట్లో వదంతి వ్యాపించినా, ఇంట్లో వాళ్లని నమ్మించడం కష్టం కాలేదు రాజుకి. తను చెప్పడమే కాకుండా, ఫ్లొరెన్సు చేతకూడా, వాళ్లిద్దరిదీ స్నేహమే తప్ప, వివాహం ప్రసక్తి లేదని ఖచ్చితంగా చెప్పించాడు. దానితో అందరూ నమ్మడమే కాకుండా ఊళ్లో వాళ్ల నోళ్లు మూయించగలిగారు, కుటుంబ సభ్యులంతా!

జనవరిలో సంక్రాంతి సౌరభాలు రుచి చూపించి తిరుగు ప్రయాణం కట్టించాడు రాజు, ఫ్లొరెన్సు చేత. కాలిఫోర్నియా తిరిగి వెళ్లిన తొమ్మిది నెలలకి ఫ్లొరెన్సు కొడుకును కన్నది. వాడు బంగిన పల్లి మామిడి పండులా ఉన్నాడు. తన కోరిక తీర్చినందుకు రాజుకి కృతజ్ఞతలు చెప్పుకుంది ఫ్లొరెన్సు. వెళ్లిపోతూ, వెళ్లిపోతూ, ఇకపై బుద్ధిగా పెళ్లి చేసుకుని ఒక ఇంటివాడివై స్థిరపడమని సలహా ఇచ్చి మరీ వెళ్లింది.

ఇంతకాలం తను విస్మరించిన జీవిత సత్యాన్ని గుర్తు చేసినందుకు ఫ్లొరెన్సుకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రాజు. ఇక ఆలస్యం చేయకుండా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంటికి ఉత్తరం రాశాడు తను రెండు నెలల్లో బయల్దేరి వస్తున్నాననీ, తన వివాహానికి పేపర్లలో ప్రకటన ఇచ్చి కొన్ని ఆఫర్లు రెడీగా ఉంచమనీ.

రాజు తల్చుకుంటే పెళ్లికూతుళ్లకి కొదవా? తను ఇండియా చేరుకునేసరికి వందలకొద్దీ వచ్చిన అప్లికేషన్లు స్క్రీన్ చేసి కొన్ని సంబంధాలు రెడీగా ఉంచారు చుట్టాలు. అన్ని విధాలా బాగుందన్న సంబంధం ఒకటి సెలక్టు చేశాడు రాజు. పెళ్లి ధూంధాంగా జరిగింది. పెళ్లి కూతురి పేరు సుజాత. శోభనం గదిలో తన గత జీవితాన్ని వివరించబోతున్న రాజుతో, అంతవరకు అతను ఎలా ఉన్నాడో తన కనవసరం అనీ, ఈ రోజు నుంచీ వాళ్లిద్దరూ ఏకమయ్యారు కనుక ఒకరి కోసం ఒకరుగా ఇకముందు బ్రతకగలిగితే తాను సంతోషిస్తానని చెప్పింది సుజాత. ఎరేంజ్‌డ్ మేరేజీలో అంతటి సంస్కారం గల యువతి తన భార్య అయినందుకు చాలా సంతోషించాడు రాజు. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి భార్య సుజాతతో సహా కాలిఫోర్నియా తిరిగి వచ్చాడు రాజు. కొత్త కాపురం నిమ్మకు నీరెత్తినట్లుగా సాగుతోంది.

అనుకోకుండా ఓనాడు ఫ్లొరెన్సు ఎక్కడినుంచో ఊడిపడింది. తను మళ్లీ పెళ్లి చేసుకుందిట. "నీ పెళ్లాం ఎంత అందంగా ఉంటుందో చూసి పోదామని వచ్చాను" అంది. భారతీయులని 'హెవెన్లీ బ్యూటీ' అని పొగిడింది. "నీ సెలక్షను బాగుంది" అంది. బాబుని అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాననీ, ఓ శుభదినాన తీసుకొచ్చి చూపిస్తాననీ చెప్పింది. రాజు గుండెలు గుభిల్లుమన్నాయి. రాజు సమయం చూసుకుని ఆమెతో చెప్పాడు. ఎంతటి

విశాల హృదయమైనా, సుజాత ఈ పచ్చి నిజాన్ని జీర్ణించుకోలేకపోవచ్చుననీ, రక్తంలో గూడుకట్టుకుపోయిన మనసులో అంతర్లీనంగా ప్రవహిస్తూండే సంప్రదాయాలు ఇటువంటి అడ్డంకుల్ని భరించలేకపోవచ్చుననీ చెప్పాడు. అతని ధర్మసంకటాన్ని అర్థం చేసుకున్న ఫ్లారెన్సు, "సరే అయితే నువ్వే ఒకసారి వచ్చి మన బాబుని చూసివెళ్లు" అని చెప్పి వెళ్లిపోయింది.

కాలం చకచకా నడిచిపోతుంది. రాజు వ్యాపారం బాగా లాభిస్తోంది. ఇద్దరు పిల్లలు పుట్టారు. పెద్దది భారతి. చ్నివాడు విజయ్. అక్కడి వాళ్లు 'విక్టర్' అని పిలుస్తారు. వాళ్లిద్దరూ అమెరికాలోనే పుట్టారు. కాబట్టి నేచురల్ యు.ఎస్. సిటిజన్సు అయ్యారు. చూస్తుండగానే పిల్లలు పెద్దవాళ్లై కాలేజీల కొచ్చారు. వయసుపైబడి జీవితాన్ని కబళించి వేస్తుంటే రాజు వ్యాపారంలో వేగం తగ్గించాడు. జెట్ స్పీడు నుంచి, బోయింగుకి దిగాడు. ఇటు కాలిఫోర్నియాలోనూ, అటు గునుపూడిలోనూ, రియల్ ఎస్టేట్స్ స్థాపించాడు. గునుపూడిలో ఏభై ఎకరాల అగ్రికల్చరల్ ఫార్మ్ బాగా వచ్చింది. గ్లోబల్ రేట్ రేస్‌తో రోజు రోజుకీ రోత పుడుతోంది రాజుకి. లంకంత ఇంట్లో, పిల్లలిద్దరికీ, వారిద్దరికీ వేరే వేరే గదులు. ఎవరి కార్లు వారికున్నాయి. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటారు. ఎప్పుడైనా వారాంతాల్లో అంతా ఒక దగ్గిర చేరి డిన్నర్ చేస్తారు. అటువంటి సందర్భాల్లోనే పిల్లలు పెద్దవాళ్లైన వైనం గమనిస్తూంటాడు రాజు. అప్పుడప్పుడూ పిల్లల ప్రవర్తన విషయంలో సుజాత గునుస్తూండడం కూడా కద్దు. విక్టర్ రోజుల తరబడి గర్ల్‌ఫ్రెండ్స్‌తో కాలం గడుపుతుంటాడు సరే. ఈ మధ్య భారతి కూడా ఒక్కోరోజు ఇంటికి రావడం లేదు. విచ్చలవిడిగా, సర్వస్వతంత్రంగా ఉండే వాతావరణంలో పెరిగారు వాళ్లు. వయసొచ్చిన పిల్లల్ని 'ఇదేమని' బెదిరించి తల్లిదండ్రులు అదుపులో పెట్టే దేశం కాదది. గట్టిగా ఏమైనా అంటే 'బై బై' చెప్పేసే పరిస్థితి. అటువంటి రోజుల్లోనే ఓనాడు ప్రమాదవశాత్తూ భారతి హ్యాండ్ బాగ్‌లో కండోమ్ము రాజు చూడడం తటస్థించింది.

ఆ వారాంతంలో డిన్నరు టేబిలు వద్ద అనౌన్సు చేశాడు రాజు. వెంటనే కాలిఫోర్నియా బిజినెస్సు మూసేసి గునుపూడి ప్రయాణం కట్టుతున్నాననీ, గునుపూడిలో పొలాలు బాగా అభివృద్ధి చేస్తే భావి జీవితం పూలపాన్పులా గడిచిపోగలదనీ.

సుజాత భారతనారిలా భర్త ననుసరించిందా?

విక్టర్ తండ్రి మీద మమకారంతో వెంటవెళ్లాడా?

భారతి ఆధునిక నాగరికతని వదలి తిరోగమనం చేసిందా?

ఈ ప్రశ్నలకి సమాధానాలు మీ మనసు తెర మీదే చూసి ఆనందించండి. ప్రస్తుతానికి రాజు ప్రయాణం మాత్రం పడమర నుంచి తూర్పుకి.

✱